క్లుప్తంగా

పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ



తెనాలిఅర్బన్: 22వ వార్డు మాజీ కౌన్సిలర్ షేక్ ఫాతిమా 9వ వర్ధంతిని పురస్కరించుకుని మారీసుపేటలో పారిశుద్ధ్య కార్మికులు 100 మందికి శనివారం దుస్తులు పంపిణీ చేశారు. ముందుగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోగినేని ఉమా మాట్లాడుతూ వార్డు అభ్యర్థికి ఫాతిమా చేసిన కృషి అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ షేక్ రేహనా, షేక్ సుభానీ, నదీయా, చల్లా పుల్లారావు, ఈదర పూర్ణచంద్, కన్నెగంటి మురళి, పావులూరి రాంబాబు, వుయ్యూరు రాజశేఖర్ రెడ్డి, కావూరి చంద్రమోహన్, రావి చిన్ని తదితరులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ పత్రాలు పంపిణీ



తెనాలిఅర్బన్: పేదల సొంతింటి కలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సాకారం చేశారని 24వ వార్డు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ పెదలంక లక్ష్మీ లావణ్య పేర్కొన్నారు. 24వ వార్డు పరిధిలోని ఇళ్ల స్థలాల లబ్ధిదారులకు శనివారం సచివాలయంలో రిజిస్ట్రేషన్ పత్రాలు పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ తెనాలి నియోజకవర్గంలో 27వేల మందికి పైగా ఇళ్ల స్థలాలు తమ ప్రభుత్వం ఇచ్చిందని చెప్పారు. వారందరికి తమ ప్రభుత్వం ఇల్లు నిర్మించి ఇస్తుందన్నారు. అందరూ వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పెదలంక వెంకటేశ్వర్లు, సీమోను, అడ్మిన్ అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

జిల్లా సేవాదళ్ విభాగ సహాయ కార్యదర్శిగా ప్రకాష్

తూములూరు(కొల్లిపర): మండలంలోని తూములూరు గ్రామానికి చెందిన కనపర్తి ప్రకాష్‌ను గుంటూరు జిల్లా సేవాదళ్ విభాగ సహాయ కార్యదర్శిగా నియమించారు. శుక్రవారం రాత్రి ప్రకాష్ తన మిత్ర బృందంతో తెనాలిలోని వైఎస్సార్ సీపీ కార్యాలయానికి వెళ్లి ఎమ్మెల్యే శివకుమార్‌ను మర్యాదపూర్వకంగా కలసి ఎమ్మెల్యేను సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ప్రకాష్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో పార్టీ గెలుపునకు తన వంతు కృషి చేస్తానన్నారు. సామాన్య కార్యకర్తగా ఉన్న తనకు జిల్లా సేవాదళ్ విభాగ కార్యదర్శిగా నియమించిన సీఎం జగనన్నకు కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట కొల్లి రాఘవరెడ్డి, నాలాడి ప్రభాకర్, బేతాల భూషణం, కనపర్తి అనీల్, జ్యోతుల సుధీర్, పి.మధు, బి.పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిపై అవగాహన కలిగి ఉండండి



తెనాలిఅర్బన్: క్షయ వ్యాధిపై అందరూ అవగాహన కలిగి ఉండాలని తెనాలి టీబీ యూనిట్ సూపర్‌వైజర్ పి.రవికుమార్ పేర్కొన్నారు. సెంటర్ ఫర్ ఉమెన్స్ సంస్థ ఆధ్వర్యంలో సుల్తానాబాద్‌లోని ఓ ప్రైవేట్ నర్సింగ్ కళాశాలలో శనివారం క్షయ వ్యాధిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ క్షయ వ్యాధి నియంత్రణకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందని తెలిపారు. క్షయ సోకిన వారు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందవచ్చని చెప్పారు. సమావేశంలో సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ పీటర్ థామస్, డి.ప్రవీణ్‌పాల్, తదితరులు పాల్గొన్నారు.

వెస్ట్‌బెర్రి స్కూల్లో ప్రీకెజి విద్యార్థులకు స్నాతకోత్సవం



తెనాలిటౌన్: బుర్రిపాలెం రోడ్డులోని వెస్ట్‌బెర్రి స్కూల్లో చిన్నారులకు ప్రీకేజీ గ్రాడ్యుయేషన్ పట్టా ప్రధానోత్సవ వేడుకలు శనివారం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు టి.వి.సుబ్రమణ్యం చిన్నారులకు గ్రాడ్యుయేషన్ పట్టాలను అందజేశారు. నేటి పోటీ ప్రపంచానికి తగినట్టుగా అన్ని విభాగాల్లో విద్యార్థులు రాణించే విధంగా విద్యను అందిస్తున్నామని చెప్పారు. చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు, గీతాలు, బుర్రకథలు విశేషంగా అలరించాయి. బడికి సంబంధించి ప్రదర్శించిన బుర్రకథ ప్రత్యేకంగా అలరించింది. కార్యక్రమంలో కో–ఆర్డినేటర్లు, ఉపాధ్యాయులు, అధ్యాపకేతర సిబ్బంది, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహనీయుడు అమరజీవి పొట్టి శ్రీరాములు

- ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్
- ఘనంగా అమరజీవి జయంతి వేడుకలు



అమరజీవి విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్, పార్టీ నేతలు

తెనాలి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాధన కోసం ప్రాణాలను త్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు చిరస్మరణీయులను ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. పొట్టి శ్రీరాములు జయంతి రోజైన శనివారం బోసురోడ్డులోని ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే శివకుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అమరజీవి చేసిన త్యాగాలను స్మరించుకున్నారు. ప్రత్యేక రాష్ట్రం కోసం ఆమరణ నిరాహారదీక్షను చేపట్టి, ప్రాణాలను తృణప్రాయంగా త్యాగం చేసిన శ్రీరాములు తెలుగు జాతి గర్వించదగిన మహనీయుడుగా చెప్పారు. పార్టీ క్లస్టర్–1 అధ్యక్షుడు మద్దాళి శేషాచలం, క్లస్టర్–2 అధ్యక్షుడు షేక్ దుబాయ్‌బాబు, మున్సిపల్ వైస్ చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, వైకుంఠపురం దేవస్థానం ట్రస్టుబోర్డు మాజీ చైర్మన్ వుప్పల వరదరాజులు, కౌన్సిలర్లు గుంటూరు కోటేశ్వరరావు, పేరం సంజీవరెడ్డి, మొగల్ అహ్మద్, షేక్ ఇస్మాయిల్, పార్టీ నేతలు కఠారి హరీష్, తాడిబోయిన బుచ్చిరాజు, తట్టుకూళ్ల అశోక్‌యాదవ్, చుండూరు సాయి, సయ్యద్ గౌస్, కోలా వాసు, షేక్ మీరావలి, గుర్రం హేమలత, షేక్ అన్సారీ తదితరులు పొట్టి శ్రీరాములుకు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

శాఖ గ్రంథాలయంలో..

తెనాలిటౌన్: రూరల్ మండలం కొలకలూరులోని శాఖ గ్రంథాలయంలో శనివారం అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి గ్రంథాలయాధికారి కడియాల సుజాత, వివర్ధినీ స్కూల్ విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పొట్టి శ్రీరాములు జీవిత చరిత్రపై విద్యార్థులకు వకృత్తవ పోటీలు నిర్వహించారు. ఆంధ్రరాష్ట్ర కోసం 58 రోజులు అమరణ నిరాహార దీక్ష చేశారని విద్యార్థులకు తెలియజేశారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. విద్యార్థులకు బిస్కెట్లు పంపిణీ చేశారు. గ్రంథాలయాధికారి సుజాత పర్యవేక్షించారు.



కొల్లిపరలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నేతలు



కొలకలూరు గ్రంథాలయలలో శ్రీరాములు చిత్రపటం వద్ద విద్యార్థుల నివాళి

అమరజీవి త్యాగాలు మరువలేనివి

కొల్లిపర: భాషా ప్రయుక్త రాష్ట్రం కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణ త్యాగం చేసిన పొట్టి శ్రీరాములు అమరజీవి అని మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు మునగాల రామలక్ష్మణరావు, కొల్లిపర గ్రామ అధ్యక్షులు అన్నవరపు రమేష్ కొనియాడారు. స్థానిక ఆర్యవైశ్య సంఘం కల్యాణ మండపం వద్ద ఉన్న పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. మండల కార్యదర్శి తాత సతీష్ కుమార్, ఆర్యవైశ్యులు సంఘం కార్యదర్శి ఎస్ సురేష్‌కుమార్, బి.పూర్ణచంద్రరావు, నూలు రామన్న, ఎస్ క్రాంతికుమార్ తదితరులు కలసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సంఘం పెద్దలు పొట్టి శ్రీరాములు జీవిత చరిత్రలోని ముఖ్యమైన సంఘటలను వివరించారు. ప్రధాన కూడలిలో స్వీట్లు, మిఠాయిలు పంచారు.

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు

- ఎమ్మెల్యే శివకుమార్
- సీసీ, బీటీ రహదారుల ప్రారంభం



కొల్లిపరలో సీసీ, బీటీ రహదారులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

కొల్లిపర: అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన అందిస్తున్నారని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. శనివారం ఉదయం కొల్లిపర గ్రామంలో కృష్ణానది కరకట్ట నుంచి చివలూరు గ్రామం వరకు సుమారు రూ.3.19కోట్లతో వేసిన సీసీ, బీటీ రహదారులను ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అన్ని వర్గాలకు న్యాయం జరిగిందన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలను అమలు చేసినట్లు చెప్పారు. సంక్షేమంతోపాటు ప్రతి గ్రామంలో అవసరమైన మేరకు సీసీ రోడ్లు, డ్రైనేజీలు, నాడు–నేడు ద్వారా పాఠశాలలు అభివృద్ధి, ప్రజల అవసరాల మేరకు సచివాలయం, ఆర్‌బీకే, హెల్త్ సెంటర్లు వంటి కార్యాలయాలకు భవన నిర్మాణాలు చేపట్టి అనేక కోట్ల రూపాయలతో గ్రామ రూపురేఖలు మార్చి అభివృద్ధి పథంలోకి నడిపించారని కొనియాడారు. కొల్లిపరలో రూ.8.5కోట్లతో 30పడకల సామాజిక ఆరోగ్య కేంద్రానికి నూతన భవన నిర్మాణం చేపట్టి పా్రరంభించి అత్యాధునిక వైద్య పరికరాలు ఏర్పాటు చేసి పూర్తిస్థాయిలో వైద్యులను నియమించి పేదలకు గతంలో ఎన్నడు లేని విధంగా వైద్య సేవలు అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగనన్న మాత్రమే అని అన్నారు. ఇంతలా పేద వారికి సంక్షేమం, అభివృద్ధి అందిస్తున్న సీఎం జగన్‌మోహన్ రెడ్డిని మరోమారు ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకుడు గుదిబండి చిన్న వెంకటరెడ్డి, ఎంపీపీ భీమవరపు పద్మావతి సంజీవరెడ్డి, పార్టీ గ్రామ కన్వీనర్ భీమవరపు శివకోటిరెడ్డి, ఉపసర్పంచ్ అవుతు కృష్ణారెడ్డి, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు భట్టిప్రోలు వెంకటలక్ష్మి శ్రీను, ఎంపీటీసీ సీహెచ్ ఝాన్సీ, గుదిబండి కృష్ణకిషోర్‌రెడ్డి, కళ్లం వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నందివెలుగులో అభివృద్ధి పనులు ప్రారంభం

తెనాలిటౌన్: అభివృద్ధి, సంక్షేమం రెండుకళ్లుగా భావించి ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. రూరల్ మండలం నందివెలుగు గ్రామంలో రూ.1.81 కోట్లతో పూర్తి చేసిన వివిధ అభివృద్ధి పనులను ఎమ్మెల్యే శనివారం ప్రారంభించారు. దళితవాడలో రూ.35లక్షలతో సచివాలయం–2, మెయిన్‌రోడ్డు నుంచి దుర్గగుడి వరకు రూ.30లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్డు, రైసుమిల్లు నుంచి దళితవాడ సచివాలయం వరకు సిమెంట్ రోడ్డు, డ్రైయిన్స్ కలిపి రూ.53లక్షలు, గడప గడప నిధులు రూ.40లక్షలతో గ్రామంలో సైడ్ డ్రైయిన్స్ ఏర్పాటు, రూ.23 లక్షలతో నిజాంపట్నం కాల్వపై నిర్మించిన కాలినడక వంతెనను ఎమ్మెల్యే శివకుమార్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ ధర్మరాజుల చెన్నకేశవులు, సర్పంచ్ దూళిపాళ్ల పవన్‌కుమార్, ఎంపీటీసీ సిలార్ జానీ, గ్రామ పార్టీ కన్వీనర్ కానుగోలు సురేష్, బొంతు నరేంద్రరెడ్డి, వేముల మహేష్, సొసైటీ చైర్‌పర్సన్ తోటకూర వసంతరావు, తన్నీరు వెంకటేశ్వరరావు, నవనీతం నాగేశ్వరరావు, దుర్గాప్రసాద్, పానకాలు, బెజ్జం బాజి, మంగా చిట్టిబాబు, చీదర్ల శాంతిరాజు, బాలగోపి, వేముల రమాదేవి, కమాదుల స్వామి, షేక్ లడ్డూ, మున్సిపల్ వైస్ చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, కౌన్సిలర్ గుంటూరు కోటేశ్వరరావు, రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు చర్యలు

తెనాలిఅర్బన్: పట్టణంలో మౌళిక వసతుల కల్పనకు అనేక చర్యలు తీసుకున్నామని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. 15వ వార్డులో నూతనంగా నిర్మించిన సిమెంట్ రోడ్డును శనివారం ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మున్సిపల్ సాధారణ నిధులు నుంచి రూ.7.20 దీనికోసం వెచ్చించినట్లు చెప్పారు. కార్యక్రమంలో కౌన్సిలర్ గుంటూరు కోటేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ క్లస్టర్ అధ్యక్షుడు మద్దాలి శేషాచలం, పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, మేడేపల్లి ప్రభాకర్, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

తెనాలి టికెట్ మళ్లీ అన్నాబత్తునిదే

- పార్టీ కార్యాలయంలో సంబరాలు
- భారీ మెజారిటీతో గెలిపిస్తామన్న పార్టీ నేతలు
- సీఎంకు కానుకగా ఇస్తామన్న ఎమ్మెల్యే శివకుమార్



ఎమ్మెల్యే శివకుమార్‌ను గజమాలతో సత్కరిస్తున్న పార్టీ నేతలు

తెనాలి: తెనాలి అసెంబ్లీ స్థానానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా స్థానిక ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్‌ను ఖరారు కావటంతో స్థానిక గంగానమ్మపేటలోని పార్టీ కార్యాలయంలో పార్టీ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. మధ్యాహ్నం ఇడుపులపాయలో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో ఎంపీ నందిగం సురేష్, ధర్మాన ప్రసాదరావులు ఎంపీ, ఎమ్మెల్యే స్థానాలకు పార్టీ అభ్యర్థులను ప్రకటించిన విషయం తెలిసిందే. పార్టీ కార్యాలయానికి అప్పటికే చేరుకున్న వందలాది పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు టీవీల్లో ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించారు. తెనాలి అసెంబ్లీ స్థానానికి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేరును ప్రకటించటంతో హర్షధ్వానాలు మిన్నుముట్టాయి. ఒకరికొకరు కరచాలనం చేస్తూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అంతలో పార్టీ కార్యాలయానికి చేరుకున్న ఎమ్మెల్యే శివకుమార్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. పూలమాలలు, పుష్పగుచ్ఛాలను అందజేసి శాలువాలతో సత్కరించారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి జయజయ ధ్వానాలు చేశారు. ఈసారి మరింత భారీ మెజారిటీతో గెలిపిస్తామని హామీనిచ్చారు.

గెలుపును సీఎంకు కానుకగా ఇస్తాను... ఎమ్మెల్యే

ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ 2024 సార్వత్రిక ఎన్నికల్లో తెనాలి అసెంబ్లీకి పార్టీ అభ్యర్థిగా మూడోసారి పోటీచేసే అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ ఎన్నికల్లో తెనాలి స్థానం నుండి భారీ మెజారిటీతో విజయం సాధించి, ఆ విజయాన్ని సీఎంకు కానుకగా ఇస్తానని ధీమా వ్యక్తంచేశారు. రాష్ట్రంలో భారీగా సంక్షేమ పథకాలను అమలుచేస్తూ, పేద, మధ్యతరగతి వర్గాల జీవన ప్రమాణాలు పెంచుతున్న ప్రభుత్వంలో భాగస్వామిని అయినందుకు గర్వపడుతున్నానని చెప్పారు. ప్రభుత్వ కార్యక్రమాలతో నిత్యం ప్రజల్లో ఉంటున్న తనను సీఎం అభినందించారని చెబుతూ, ఆయన నమ్మకాన్ని నిలబెట్టుకునేలా గుంటూరు పార్లమెంటు సభ్యుడిగా కిలారి వెంకట రోశయ్య, తాను కలిసి లక్ష ఓట్ల మెజారిటీతో విజయం సాధిస్తామని చెప్పారు. ఎమ్మెల్యేను అభినందిన పార్టీ నాయకుల్లో పార్టీ పట్టణ1, 2 అధ్యక్షులు మద్దాళి శేషాచలం, షేక్ దుబాయ్‌బాబు, గుంటూరు కోటేశ్వరరావు, చెన్నుబోయిన శ్రీనివాసరావు, తిరుమలశెట్టి శ్రీనివాసరావు, జలగం రామకృష్ణ, కొమ్ము రాయల్, కుక్కల ముత్తేశ్వరరావు, జేబీ జిలాని, గోల్డ్ రహీమా, యాతాటి అనిల్, షేక్ నూర్ ఇస్మాయిల్, మల్లెబోయిన రాము, ఉడుముల మహేష్‌రెడ్డి, కుర్రా జస్వంత్, గొర్రెపాటి వేణుగోపాలరెడ్డి, పెచ్చింగ్ సుభాని, షేక్ మీరావలి, జి.బాలరాజు, అక్కిదాసు కిరణ్‌కుమార్, కాళిదాసు వెంకటేశ్వరరావు, హైమారావు, కావూరి కిషోర్, చుండూరు గోపి తదితరులున్నారు.

ముమ్మరంగా వైఎస్సార్ సీపీ ప్రచారం



27వ వార్డులో మహిళకు కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సతీమణి పుష్ప



సంక్షేమ పథకాల కరపత్రాలను అందజేసి మహిళతో మాట్లాడుతున్న సత్యనారాయణ

తెనాలిఅర్బన్: మే 13న జరగనున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు రెండు ఓట్లు వేసేందుకు అందరూ సిద్ధంగా ఉండాలని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ సతీమణి, పుష్ప మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారాన్ని శనివారం సాయంత్రం అన్నాబత్తుని పుష్ప 27వ వార్డులో లింగారావు హాస్పటల్ నుంచి, మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక 37వ వార్డులో ఏఎస్ఎన్ కాలేజ్ సమీపం నుంచి ప్రారంభించారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమాన్ని తెలియజేసి ఓట్లు అభ్యర్థించారు. 27వ వార్డులో జరిగిన కార్యక్రమంలో కౌన్సిలర్లు గుంటూరు కోటేశ్వరరావు, యాతాటి అనిల్, రావి ప్రశాంతి, రావి శ్రీనివాసరావు, కఠారి హరీష్, కొడాలి క్రాంతి, బండ్లమూడి భాస్కరరావు, రావి మణి, రావి రాంబాబు, కోగంటి ఆశు, కోగంటి బాబ్జి, నాగసరపు కృష్ణ, మదాసు సత్యం, జీఎంఆర్, యడ్లపల్లి రాధాకృష్ణ, కట్టా బుల్లయ్య, నరేష్, బండ్లమూడి నాని, రావూరి నరేష్, 37వ వార్డులో మున్సిపల్ వైస్‌చైర్మన్ అత్తోట నాగవేణి, కౌన్సిలర్ సువర్ణరేఖాదేవి, వైఎస్సార్ సీపీ నాయకులు మల్లిబోయిన రాము, సిరి కృష్ణ, తట్టుకుళ్ల అశోక్ యాదవ్, కోలా వాసు, తాడిబోయిన రమేష్, అత్తోట శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

పెదరావూరులో ఎన్నికల ప్రచారం

తెనాలిటౌన్: రూరల్ మండలం పెదరావూరు గ్రామంలో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ తనయుడు సత్యనారాయణ శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలసి ఆయన ఇంటింటికి తిరిగి ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. రాబోయే ఎన్నికల్లో గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి కిలారి వెంకట రోశయ్య, తెనాలి అసెంబ్లీ అభ్యర్థి అనాబత్తుని శివకుమార్‌లను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ప్రచారంలో సర్పంచ్ కాకి రమాదేవి, మండల పార్టీ అధ్యక్షుడు చెన్నుబోయిన శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యుడు రావూరి యేసుదాసు, పార్టీ నాయకులు కాకి మనోజ్, రావూరి విజయ్, కుదరవల్లి శంకరరావు, శరాబందీ, మల్లికార్జునరావు, కరిముల్లా, ఉడుముల మహేష్‌రెడ్డి కార్యకర్తలు పాల్గొన్నారు.



37వ వార్డులో మహిళకు కరపత్రాలు పంపిణీ చేస్తున్న చైర్‌పర్సన్ రాధిక, కౌన్సిలర్ సువర్ణరేఖాదేవి



తూములూరు లో ఎన్నికల పచారం చేస్తున్న ఎమ్మెల్యే తనయుడు అఖిల్ గణేష్

జగన్‌ను మళ్లీ సీఎం చేసుకుందాం

తూములూరు(కొల్లిపర): వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుందామని తెనాలి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ తనయుడు అఖిల్‌గణేష్ అన్నారు. శనివారం ఆయన తూములూరు గ్రామంలో ఎన్నికల ప్రచారంతో భాగంగా రెండో రోజు మర్రెడ్డి కల్యాణ మండపం వద్ద నుంచి స్థానిక నాయకులతో కలసి విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. పేదవారికి సంక్షేమం పథకాలు కొనసాగాలంటే వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలన్నారు. మళ్లీ ఎమ్మెల్యేగా శివకుమార్‌కు, సీఎంగా జగనన్నను గెలిపించాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ భీమవరపు పద్మావతి సంజీవరెడ్డి, సొసైటీ అధ్యక్షులు ఈమని హరికోటిరెడ్డి, పాలకేంద్రం అధ్యక్షులు ఉయ్యూరు ఉమామహేశ్వరరెడ్డి, ఎంపీటీసీలు మర్రెడ్డి మాధవి, అవుతు బసవపున్నారెడ్డి, గ్రామ పార్టీ నాయకులు మర్రెడ్డి బ్రహ్మారెడ్డి, ఈద హర్షవర్ధనరెడ్డి, భేతాల భూషణం, ఎ.శివారెడ్డి, మర్రెడ్డి సాంబిరెడ్డి, నాగరాజు పాల్గొన్నారు.

రాష్ట్రంలో సామాజిక విప్లవం తెచ్చిన సీఎం జగన్

- ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్
- ఘనంగా మేదర సంఘీయుల ఆత్మీయ సమావేశం

తెనాలిఅర్బన్: రాష్ట్రంలో సామాజిక విప్లవాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకువచ్చారని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. పట్టణంలోని 33వ వార్డులో మేదర సంఘీయుల ఆత్మీయ సమావేశాన్ని శుక్రవారం రాత్రి నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వాలు మేదర సామాజిక వర్గాన్ని నిర్లక్ష్యం చేశాయని తెలిపారు. తమ ప్రభుత్వం రాష్ట్రస్థాయిలో అనేక పదవులను ఇచ్చి వారి అభ్యున్నతికి పాటుపడిందని చెప్పారు. తమ ప్రభుత్వానికి, గత ప్రభుత్వానికి ఉన్న తేడాలను గమనించాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికి తమ ప్రభుత్వం సంక్షేమ ఫలాలు అందించి ఆర్థికాభివృద్ధికి తోడ్పాడిందని చెప్పారు. ఎనడు లేని విధంగా తమ ప్రభుత్వం పేదలందరికి ఇళ్ల స్థలాలు ఇచ్చిందని గుర్తు చేశారు. వారిలో ఇప్పటికే కొంతమంది ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకుని ఆ నివాసాల్లో జీవిస్తున్నారని చెప్పారు. ఇళ్ల స్థలాలు పొందినవారు ఇళ్లు నిర్మించుకున్నవారిలో కూడా మేదర సామాజిక వర్గంవారు ఉన్నారని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో అందరూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. అనంతరం రాష్ట్రస్థాయిలో పదవులు పొందిన వారిని సన్మానించారు. సమావేశంలో కౌన్సిలర్ మొగల్ అహ్మద్ బేగ్, మేదర సంఘ నాయకులు నాగేశ్వరరావు, రాఘవరావు, రామారావు, పార్వతీ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

లోక్‌అదాలత్ ఇరు పక్షాలకు మేలు



తెనాలిరూరల్: కేసుల సత్వర పరిష్కారం కోసం లోక్ అదాలత్ చక్కటి వేదిక అని, తద్వారా కక్షిదారుల సమయం, ధనం ఆదా అవుతుందని న్యాయమూర్తులు చెప్పారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశానుసారం, రాష్ట్ర, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సూచనలు మేరకు శనివారం స్థానిక న్యాయస్థానంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. న్యాయమూర్తులు వీఏఎల్ సత్యవతి, ఎం. శ్రీధర్, షేక్ అబ్దుల్ షరీఫ్, జె.శ్రీసత్య మాట్లాడుతూ ప్రస్తుతం నమోదవుతున్న కేసుల్లో చాలా వరకు కూర్చొని మాట్లాడుకుంటే పరిష్కారమవుతాయని,కక్షిదారులు అనవసరమైన భేషజాలకు వెళ్లి సమయాన్ని, ధనాన్ని వృథా చేసుకుంటున్నారని అన్నారు. లోక్ అదాలత్‌లో 16 సివిల్, 167 క్రిమినల్, 22 ప్రి లిటిగేషన్ కేసులు పరిష్కారమయ్యాయి. బాధితులకు రూ.1,90,70,900 పరిహారం కింద అందించారు. ఎస్‌వీ మహేశ్వరరావు, సోలాశంకర్, జి.వెంకయ్య ఉన్నారు.

డాక్టర్ శారదకు షారోన్ అంతర్జాతీయ సేవా అవార్డు

పట్టణ ప్రముఖుల చేతులమీదుగా సేవా మెడల్, అవార్డు ప్రదానం



డాక్టర్ శారదకు అవార్డు ప్రదానం చేస్తున్న ఖలేదా నసీమ్, రాజకుమారి, డాక్టర్ అన్నపూర్ణ

తెనాలి: కెనడా దేశానికి చెందిన ప్రముఖ సంఘ సేవకురాలు షారోన్ పేరిట ఏర్పాటుచేసిన అంతర్జాతీయ సేవా అవార్డు–2014 ప్రదానోత్సవాన్ని శనివారం నిర్వహించారు. స్వచ్ఛంద సేవా సంస్థ పెన్నీ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో స్థానిక రత్న ఫార్చ్యున్ కల్యాణ మండపంలో ఏర్పాటైన సభలో పట్టణానికి చెందిన డీ3 శారద సర్వీస్ సొసైటీ వ్యవస్థాపకురాలు డాక్టర్ డి.శారదకు సేవా మెడల్‌ను, అవార్డును ప్రముఖుల చేతులమీదుగా ప్రదానం చేశారు. సంస్థ వ్యవస్థాపకుడు, సినీదర్శకుడు దిలీప్‌రాజా అధ్యక్షత వహించారు. సత్కార గ్రహీత డాక్టర్ శారద మాట్లాడుతూ వైద్య ప్రమాణాన్ని గౌరవిస్తూ వైద్యులు నిస్వార్థంగా వైద్యం అందించాలనేది తన అభిమతమన్నారు. కరోనా రోజుల్లో ఇంటింటికీ వైద్యం అందించగలగటం, ఇప్పుడు మహిళల్లో క్యాన్సర్ రహిత తెనాలికి కృషిచేయటం, ధర్మ టెలీహెల్త్ ప్రాజెక్టుతో కొన్ని ప్రాణాలను నిలపటానికి మించిన సంతృప్తి మరొకటి లేదన్నారు. ధర్మ ప్రాజెక్టు త్వరలో గేమ్ ఛేంజర్ కాగలదన్నారు. మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్ మాట్లాడుతూ కరోనా సమయంలో డాక్టర్ శారద బాధితులకు అందించిన సేవలు సాహసోపేతమన్నారు. ఏపీ మహిళా కమిషన్ మాజీ చైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి మాట్లాడుతూ సొంత లాభం మానుకుని వైద్యసేవలను ఉచితంగా అందిస్తున్న శారద మానవతను కొనియాడారు. డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ అన్నపూర్ణ మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యులతోపాటు కరోనా రోగుల సేవలో శారద పాలుపంచుకున్నారని చెప్పారు. శారదను సత్కరించారు. డాక్టర్ ఐనంపూడి శరత్‌బాబు, డాక్టర్ ప్రేమ్‌చంద్, డాక్టర్ రాకేష్, రోటరీ క్లబ్ మాజీ డిస్ట్రిక్ట్ గవర్నర్ గుత్తా వెంకటరత్నం, ఎస్.సుగుణ, పి.విజయలక్ష్మి, మన్నే సత్యనారాయణ, ఆర్టీసీ ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

అద్వితీయం 'నటరాజు' పాతూరి కళాభినివేశం

కాంస్య విగ్రహావిష్కరణలో ఎమ్మెల్యే శివకుమార్



విగ్రహాన్ని ఆవిష్కరించి పుష్పాంజలి ఘటిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: ఆంధ్రాప్యారిస్ తెనాలి పౌరాణిక, నాటక, రంగస్థల కీర్తిని ఇనుమడింపజేసిన తొలి తరం నటుల్లో 'నటరాజ' పాతూరి రామకృష్ణమూర్తి కళాప్రతిభ అద్వితీయమని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. స్థానిక తెనాలి బండ్‌పై ప్రతిష్టిస్తున్న మహనీయుల విగ్రహాల్లో భాగంగా శనివారం ఉదయం పాతూరి రామకృష్ణమూర్తి విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. నటరాజ పాతూరి నాటక సాహితీ కళాసమితి ఆధ్వర్యంలో జరిగిన సభలో ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ, మధురవాణి, సీత పాత్రలతో ఆరంభమైన రామకృష్ణమూర్తి కళాభినివేశం, ఘటోత్కచుడు, యముడు, రంగారాయుడు, దుర్యోధనుడు, గయుడు, యయాతి, విశ్వామిత్ర వంటి పాత్రలతో ప్రసిద్ధి చెందినట్టు చెప్పారు. 1958లో జరిగిన ఆంధ్ర నాటక కళాపరిషత్ పోటీల్లో దుర్యోధన పాత్రకు ప్రథమ బహుమతిని పొందటం, దిగ్గజ కవుల ప్రశంసలను అందుకోవటం ఆయన కళాప్రతిభకు నిదర్శనమన్నారు. ముఖ్యఅతిథిగా బెంగళూరుకు చెందిన పాతూరి జనార్ధనరావు పాల్గొన్నారు. కళాసమితి వ్యవస్థాపకుడు డాక్టర్ పాతూరి సుబ్రహ్మణ్యకవి తన ప్రసంగంలో రామకృష్ణమూర్తి జీవిత విశేషాలను తెలియజేశారు. మరో ప్రముఖుడు ఎం.కృష్ణకిషోర్, కఠెవరం సర్పంచ్ గంపల శివనాగేశ్వరరావు, పట్టణ రంగస్థల కళాకారుల సంఘం ప్రధాన కార్యదర్శి గరికపాటి సుబ్బారావు, ప్రసిద్ధ పౌరాణిక నటుడు ఆరాధ్యుల కోటేశ్వరరావు మాట్లాడారు.

పట్టణంలో ప్రారంభమైన ప్లెక్సీలు తొలగింపు

తెనాలిఅర్బన్: కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు తెనాలి పట్టణంలో ఉన్న వివిధ రాజకీయ పార్టీ నాయకుల ప్లెక్సీల తొలగింపును శనివారం సాయంత్రం చేపట్టారు. దేశ వ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన నేపథ్యంలో దీనిని చేపట్టినట్లు మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న తెలిపారు. ఇప్పటి నుంచి ఎవరైనా అనుమతి లేకుండా ప్లెక్సీలను ఏర్పాటు చేయడం నిషేధమని చెప్పారు. ఎవరైనా ఏర్పాటు చేయదలచితే తప్పని సరిగ్గా అధికారుల అనుమతి తీసుకోవాల్సి ఉంటుందని చెప్పారు. పట్టణంలో మిగిలిన ప్లెక్సీలను కూడా ఆయా రాజకీయపార్టీ నాయకులు స్వచ్ఛందంగా తొలగించుకోవాలని సూచించారు. ఎన్నికల నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు.